క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమ్రాబాద్: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని జంగంరెడ్డిపల్లి, ఎల్మపల్లి, తెలుగుపల్లి, కల్ములోనిపల్లి, మాచారం, కొత్తపల్లి, ఎమిరెడ్డిపల్లి, తిరుమలాపూర్(బీకే) మొల్కమామిడి గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

కొల్లాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాహక్కు చట్టం అమలుపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవనికుమార్ మాదిగ ఆరోపించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశాలు ఏర్పడుతాయని, అందరికీ సమాన విద్య అందుతుందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యావ్యవస్థకు కొమ్ముకాస్తూ పాలక ప్రభుత్వాలు విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. సమావేశంలో నాయకులు వెంకటస్వామి, రాము తదితరులున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం డాక్టర్ వినోద్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజేందర్‌సింగ్, డాక్టర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందజేత

లింగాల: మండలంలోని అవుసలికుంటకు చెందిన నాగరాజుకు సంబంధించిన గొర్రెను వెస్ట్ బీట్ పెద్దగుట్ట దగ్గర చిరుత పులి రెండు నెలల కిందట గొర్రెపై దాడి చేసి చంపింది. ఈ మేరకు అటవీ శాఖ వారు విచారణ చేపట్టారు. శనివారం అటవీశాఖ అధికారి వీరేశం బాధితుడికి రూ.8వేల చెక్కును అందజేశారు. బీట్ ఆఫీసర్ ఖాదర్‌పాషా పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి టౌన్: ఆస్తిపన్నుపై ఉన్న వడ్డీపై 90 రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలో సిబ్బందితో తిరుగుతూ పన్నులను వసూలు చేశారు. ఆస్తిపన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆదివారం వరకు గడువు ఉందని పేర్కొన్నారు. కమిషనర్ వెంట మేనేజర్ రాజకుమారి, ఆర్‌ఐ చంద్రయ్య, సిబ్బంది ఉన్నారు.

హత్యాయత్నం ఘటనపై విచారణ

బల్మూర్: మండలంలోని మైలారం స్టేజీ వద్ద బల్మూర్‌కు చెందిన వినోద్ యువకుడిపై ఈనెల 27న రాత్రి గుర్తు తెలియని దుండగులు కత్తితో దాడి చేశారు. ఈ ఘటనపై శనివారం అచ్చంపేట సీఐ రవీందర్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడిని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం దుండగులపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

అంబులెన్స్‌లో చెంచు మహిళ ప్రసవం



బల్మూర్: చెంచు మహిళ అంబులెన్స్‌లో పండంటి మగ శిశువుకు జన్మనిచ్చిన ఘటన శనివారం చోటుచేసుకుంది. 108 ఈఎంటీ లలిత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బాణాల గ్రామానికి చెందిన మాసమ్మ పురిటి నొప్పులతో బాధపడుతోంది. బాధిత కుటుంబసభ్యులు 108కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో గ్రామానికి చేరుకొని మహిళను అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మార్గమధ్యలో మాసమ్మకు పురిటి నొప్పులు ఎక్కువకావడంతో అంబులెన్స్ సిబ్బంది కాన్పు చేశారు. మహిళ పండంటి మగశిశువు జన్మనిచ్చిందని అంబులెన్స్ సిబ్బంది పేర్కొన్నారు. ఇదివరకే మహిళకు ఏడుగురు ఆడపిల్లలు ఉన్నారని తెలిపారు.

కొత్త పనులపై దృష్టి ఏది?

- ఉపాధిహామీ పథకంలో 266 రకాల పనులు
- పట్టింపులేని అధికారులు, పాలకులు



ఉప్పునుంతల- గట్టుకాడిపల్లి రోడ్డు పక్కన రైతు పొలంలో పనులు చేస్తున్న కూలీలు

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకం ఎంతో ప్రాధాన్యం సంతరించుకొంది. ప్రభుత్వం వందల పనులను గుర్తించినా అధికారులు ఆదిశగా పనులు చేయించడం లేదు. కొన్ని పనులకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. కొత్త పనులపై దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో యాసంగి వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో కూలీలు ఉపాధి పనుల వైపు మొగ్గుచూపుతున్నారు. రెండు వారాలుగా కూలీలు పనులకు వెళ్తున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతులకు, కూలీలకు ప్రయోజనం చేకూర్చే పలురకాల పనులను రూపకల్పన చేసినా కొన్ని పనులకు మాత్రమే పరిమితమవుతుండటంతో పథకం లక్ష్యం పూర్తి స్థాయిలో నెరవేరడంలేదు. పథకంలో నిర్దేశించిన విధంగా 266 రకాలు పనులను చేపట్టే అవకాశం ఉంది. రైతుల్లో అవగాహన కల్పించకపోవడంతో కేవలం పది రకాల పనులకు మించి ప్రయోజనం పొందడం లేదు. ప్రతియేటా కేవలం భూమిచదును, చెట్ల తొలగింపు, నీటి నిలువ గుంటలు తదితర భూ అభివృద్ధి పనులే చేస్తున్నారు. తోటల పెంపకంపై అంతగా ఆసక్తి చూపడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

10128 జాబ్ కార్డులు

మండలంలో10128 జాబ్ కార్డులు ఉండగా వాటిలో 4931 జాబ్ కార్డులు యాక్టీవ్‌గా ఉన్నాయి. మొత్తం కూలీలు 20821 మంది ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం 2023–24 గాను 2.26 లక్షలు పనిదినాలు కల్పించాలనే లక్ష్యం ఉండగా 2.42 లక్షల వరకు పనిదినాలు కల్పించినట్లు ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను 2.30 లక్షల పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు కొనసాగుతున్నాయి. దాదాపుగా 2200ల మంది కూలీలు పనులు చేస్తున్నారు.

రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులెన్నో..

ఈజీఎస్‌లో రైతులకు ప్రయోజనం చేకూర్చే పలు రకాల పనులు ఉన్నాయి. కంపోస్టు ఎరువు గుంత, వ్యవసాయ పొలాల్లో పంట నూర్పిడి, వ్యవసాయ పొలాల్లోకి రోడ్లు వేసుకోవడం, భూఉపరితల నీటి కుంటలు, కొత్త సేద్యపు బావుల తవ్వకం, వర్మీ కంపోస్టు పిట్‌లు, కొత్తగా పంట కాలువలు, ఉమ్మడి భూముల్లో పశువుల నీటి కోసం కుంటల నిర్మాణం, పశువులు, జీవాల తాగునీటి తొట్ల నిర్మాణాలు, పశువులు, మేకల పాకలు, కోళ్ల ఫారం నిర్మాణాలు, గడ్డి పెంపకం పనులు చేసుకోవచ్చు. అదేవిధంగా భూమి సరిహద్దు చుట్టూ కందకాలు తవ్వడం, చేపల ఉత్పత్తి కుంటల నిర్మాణాలు, శ్మశాన వాటికల స్థలాలను అభివృద్ధి చేయడం, శ్మశాన వాటికల వద్దకు రోడ్లను వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో రహదారుల నిర్మాణం, ఇంకుడు గుంతల నిర్మాణం, రైతుల పంట పొలాల గట్లపై మొక్కల పెంపకం తాటి వనాల పెంపకం వంటి పలురకాల పనులను చేపట్టి రైతులు వ్యక్తిగతంగా, సామూహికంగా ఈజీఎస్‌లో ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో ఈజీఎస్‌లో చేసుకునే అవకాశం ఉన్న పనులపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పనుల వివరాలు వివరిస్తున్నాం..



ఈజీఎస్‌లో పనుల ఎంపిక కోసం ఏర్పాటుచేసే గ్రామ సభల్లో పూర్తిగా పనుల వివరాలను వివరిస్తున్నాం. పథకంలో నిర్దేశించిన పనులు చేసుకోవడానికి ముందుకు వచ్చే రైతుల పొలాల్లో పనులు చేయించడానికి సిద్ధంగా ఉన్నాం. జాబ్‌కార్డు కలిగిన 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్నకారు రైతులు తాము చేయించుకోదల్సిన పనులను గ్రామ పంచాయతీ తీర్మానంతో దరఖాస్తు చేసుకుంటే పనులు చేయిస్తాం. జాబ్‌కార్డులేని కూలీలకు జాబ్‌కార్డులు అందజేసి పనులు కల్పించడానికి సిద్ధంగా ఉన్నాం.

– సుదర్శన్‌గౌడ్, ఈజీఎస్ ఏపీఓ, ఉప్పునుంతల

ఆర్టీసీ డిపోలో ఎస్సీ, ఎస్టీ కమిటీ ఎన్నిక



కమిటీ ప్రధాన కార్యదర్శికి సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఎస్సీ, ఎస్టీ నూతన కమిటీని శనివారం జిల్లా కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య ప్రధాన కార్యదర్శి సుందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణంలోని టీఎస్ జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ఏర్పాటు చేశారు. డిపో అధ్యక్షుడిగా చిన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిచంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శి రాగం తిరుపతయ్య, ఉపాధ్యక్షుడు నారాయణ, అంజనమ్మ, అర్జున్ కార్యదర్శులుగా రంజిత్ కుమార్, ఊశన్న, వెంకటయ్య, ఆనంద్, లక్ష్మి, కోశాధికారి నారాయణలతో పాటూ ముఖ్య సలహాదారులుగా రత్నమ్మ, ఇందిరమ్మ, బాలస్వామి, మోహన్‌లాల్, కాశన్న, ఎంజీ నాయక్, రాములు, చంద్రు, పర్వతాలు ఎన్నికయ్యారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి



బిజినేపల్లి: ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికుడు భుక్యాప్రసాద్ ఆత్మహత్యకు కారణం అయిన పంచాయతీ కార్యదర్శి మండడి అమరేందర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం పాలెం గ్రామ పంచాయతీ కార్మికులు ఆ గ్రామ ప్రత్యేకాధికారి భాషకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీసం రూ.26వేలు వేతనం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్న బీరయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు, రామేశ్వరమ్మ, మశన్న, కొండయ్య, వెంకటయ్య, వేంకటేష్, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

ఉప్పునుంతల: మండలంలోని ఫిరట్వానిపల్లిలో యాదవుల కులదైవం పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, సామూహిక హోమాలు చేశారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆదివారం అమ్మవారికి బోనాల ఉత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వెంకట్‌నారాయణ, అంజనేయులు, తిర్పతయ్య, పెంటయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న యాదవులు

బస్టాండ్ వెలవెల

అమ్రాబాద్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ప్రయాణికుల కోసం నిర్మించిన బస్టాండ్ లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డపక్కను బస్సులను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సులు రాక వెలవెలబోతున్న అమ్రాబాద్ బస్టాండ్

వాటర్ బాటిల్స్ పంపిణీ

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోత్స్న, సంస్థ ప్రధాన కార్యదర్శి మహేష్, రాంప్రసాద్, భీమయ్య, గోపీనాథ్, శివకుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు



పెంట్లవెల్లిలో



చారకొండ పరీక్ష రాసి ఉత్సాహంగా బయటకు వస్తున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 566 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ కొండారెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ పి ఉదయ్ కుమార్ తనిఖీ చేశారు.

చారకొండ: చారకొండ మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష కేంద్రంలో పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 202 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మండల కేంద్రంలో కేజీబీవీ, ఎస్సీ హాస్టల్‌లో వేర్వేరుగా పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు హాస్టల్‌లో విడిచి వెళ్తున్న సందర్భంగా తోటి స్నేహితులతో జ్ఞాపకాలను పంచుకొని కన్నీరు పెట్టారు. కేజీబీవీ పాఠశాల ఎస్‌ఓ మంజుల, సాంఘిక సంక్షేమ వసతి గృహం వెల్ఫేర్ ఆఫీసర్ పాండు నాయక్ ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు.



చారకొండ ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో వార్డెన్ పాండు నాయక్

పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు జటప్రోల్ సెంటర్‌లలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగలేదని ఎంఈఓ చంద్రునాయక్ అన్నారు. 100 శాతం విద్యార్థులకు హాజరయ్యారని పేర్కొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 279 విద్యార్థులకు అందరూ హాజరయ్యారు. పాఠశాల నుంచి వెళ్తున్న 10వ విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు పూలు చల్లి వీడ్కోలు పలికారు.

తాడూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, శిర్సవాడలో పరీక్ష కేంద్రాల్లో 393 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

కోడేరు: మండలంలో మొత్తం 319 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణయ్య, కురుమయ్యలు తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి రామకృష్ణారావు

తెలకపల్లి: మండలంలోని చిన్నముద్దునూర్‌లో శనివారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో అన్ని అంశాలలో చురుకుగా పాల్గొనాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని సూచించారు. ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కమల్ షాజహాన్, డీపీఓ కృష్ణ, ఎంపీఓ వెంకటయ్య, డాక్టర్ కోదండరాయుడు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



మాట్లాడుతున్న సీఐ విష్ణువర్ధన్ రెడ్డి

చారకొండ: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వెల్దండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని తుర్కలపల్లిలో స్థానిక ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ఉపయోగాలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, చట్టాలు, మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంతో వారం రోజుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

బైక్ అపహరణ

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన వెంకటయ్య బైక్ చోరీ అయిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో నిర్వహిస్తున్న జాతర ఉత్సవాలకు వెంకటయ్య ద్విచక్ర వాహనంపై వచ్చాడు. దేవాలయ సమీపంలో బైక్‌ను పార్క్ చేశాడు. ఉత్సవాలను తిలకించిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు బైక్ దగ్గరకు రాగా కన్పించలేదు. ద్విచక్రవాహనం అపహరణకు గురైనట్లు భావించి మండలంలో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

అడవి పందుల స్వైరవిహారం



మన్ననూర్: యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంటపై అడవి పందులు స్వైర విహారం చేసి పంట అంతా నాశనం చేశాయి. స్థానికుల వివరాల ప్రకారం రైతు రాందాస్ మన్ననూర్ గ్రామం ఉమా మహేశ్వర కాలనీ నుంచి దుర్వాసుల చెరువుకు వెళ్లే దారిలో నాలుగు ఎకరాలలో మొక్క జొన్న పంట చేశాడు. శుక్రవారం రాత్రి అడవి పందులు పంటలోకి ప్రవేశించి ధ్వంసం చేశాయి. పంట నష్టం గురించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంబంధిత బీట్ ఆఫీసర్ సరిత, వాచర్ల సమక్షంలో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేశారు. ఉన్నతాధికారులు స్పందించి బాధిత రైతుకు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మన్ననూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అమ్రాబాద్ మండలం మాధవానిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు బైక్‌పై వెళ్తున్నాడు. మన్ననూర్ అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. లక్ష్మణ్‌రావుకు తలకు గాయాలయ్యాయి. మన్ననూర్ పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సీసీ వేశారు.. క్యూరింగ్ మరిచారు

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయ ఆవరణలో రూ.8 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. నాలుగు రోజులు మాత్రమే క్యూరింగ్ చేశారు. మరికొన్ని రోజులు క్యూరింగ్ చేయాల్సిన ఉన్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. సీసీ రోడ్డు నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు నీటిని పట్టాలని పలువురు కోరుతున్నారు.



తాడూరులో సీసీ రోడ్డు

ఆర్థికసాయం అందజేత



వెల్దండ మండలం కుప్పగండ్లలో ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన కాంట్రాక్ట్ లెక్చరర్ వెంకటయ్యయాదవ్ ఇటీవల గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. గ్రామానికి చెందిన నరాకట్ల రమేష్ శనివారం బాధితుడికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన యువకుడు కోటయ్య అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.4 వేల ఆర్థికసాయం అందజేశారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన నూకపు కోటయ్య శుక్రవారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ముదిరాజు సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.17 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజు సంఘం అధ్యక్షుడు బీమయ్య, నాయకులు కుంభం సూరి, కుమార, పాండు, సంతోష్, పాల్గొన్నారు.

మోటార్ల దొంగలపై నిఘా ఉంచాలి

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల రైతుల పంట పొలాల వద్ద ఉన్న మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారని, వీటిపై పోలీసులు నిఘా వేసి ఉంచాలని రైతు కావలి మహేష్ పోలీసు అధికారులకు విన్నవించారు. తమ పొలం వద్ద మోటార్‌లకు అమర్చి ఉన్న 20 మీటర్ల కేబుల్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని ఆయన ఆవేదన చెందారు. గతంలో కామదేనుపల్లి శివారులోని డీ28 జూరాల కెనాల్‌లో కటికె శ్రీనివాసులు అనే రైతుకు చెందిన 5 అస్వర్ల మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని, ఈ సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. ఇప్పటికీ చోరీకి పాల్పడిన వారిని గుర్తించలేదని వాపోయారు. పోలీసులు రైతులకు నష్టం జరుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సన్మానం

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించిన కొండలయ్య సేవలు మరువలేనివని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా రవినాయక్ అన్నారు. శనివారం పదవీ విరమణ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో కొండలయ్యను సన్మానించారు. సమావేశంలో వైద్యాధికారి డా కృష్ణయ్యతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.